GOLCONDA TIMES NEWS

# గోల్కొండ టైమ్స్

Regd. by Govt of India
No.UDYAM-TS-20-0003208

www.golcondatimes.com
ఆదివారం 22, మార్చి 2026
పేజీలు : 04



## రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

04

## ఆగమశాస్త్రానుసారమే

# భద్రాచలం అభివృద్ధి

### సహజత్వానికి ఏమాత్రం భంగం కలగకుండా ప్రణాళికలు



- మూడు దశల్లో ఆలయ అభివృద్ధిపై ప్రణాళికలు
- భద్రాచలం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఇబ్బందులు లేకుండా దర్శన సౌకర్యాలు కల్పించాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మూడు దశ ఆలయ అభివృద్ధి పనులు
- సీతారామచంద్ర స్వామి వారి ఆలయ అభివృద్ధిపై ఉన్నతస్థాయి సమావేశం

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి ఆలయ సహజత్వానికి ఏమాత్రం భంగం కలగకుండా అభివృద్ధి పనులు పూర్తిగా ఆగమ శాస్త్రానుసారం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సీతారామచంద్ర స్వామి వారి ఆలయ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి శనివారం హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఇప్పటి వరకు పూర్తయిన భూసేకరణకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఆగమశాస్త్రానుసారం అభివృద్ధి పనుల నిర్వహణ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు దశల్లో పనులను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి చేయగలిగిన పనులను ముందుగా గుర్తించి, అందుకు సంబంధించిన అంచనాలతో...

మిగతా 2లో...

## నేడు రైతు భరోసా నిధుల విడుదల

### సిద్దిపేటలో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

- అన్నదాతల ఖాతాల్లోకి డబ్బులు
- ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభం
- శుద్ధి చేసే రిఫైనరీకి కూడా శంకుస్థాపన
- రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఊపు
- రైతులకు మరింత అదనపు లబ్ధి
- సీఎం పర్యటనపై మంత్రులు సమీక్ష

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ రాష్ట్రంలోని కోటిన్నర ఎకరాలకు సాగు పెట్టుబడి సాయం అందించేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం 'రైతు భరోసా' నిధుల విడుదలు చేస్తోంది. ఉగాది పండుగ కానుకగా ఆదివారం నుంచి రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసే ప్రక్రియ ప్రారంభం కానుంది. సిద్దిపేట జిల్లా నర్మెట్ట వేదికగా సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో ప్రభుత్వం..

మిగతా 2లో...

## షిప్పింగ్ మార్గాలపై

# దాడులు వద్దు

### ప్రపంచ సరఫరా గొలుసులకు పెద్ద ముప్పు

- స్వేచ్ఛా నౌకాయానం, సముద్ర మార్గాల భద్రత ముఖ్యం
- పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు తీసుకురావాలి
- కీలక మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం
- ఇలాంటి దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయి
- శాంతిని, సుస్థిరతను తీసుకురావాలని ఆకాంక్ష
- భారత పౌరుల భద్రతకు అందిస్తున్న నిరంతర సహకారానికి కృతజ్ఞతలు
- ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని నరేంద్ర మోడీ

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్‌తో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఇరాన్ అధ్యక్షుడికి ఈద్, నౌరోజ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ సీజన్ పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్షించారు. పండుగ పూట కేవలం శుభాకాంక్షలు చెప్పుకోవడానికే పరిమితం కాకుండా, పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఈ ఇద్దరు అగ్రనేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఈద్, నౌరూజ్ పర్వదినాల సందర్భంగా ఇరాన్ ప్రజలకు మోదీ తన సందేశాన్ని పంపుతూ, ఈ పండుగ సీజన్ ప్రాంతీయంగా శాంతిని, సుస్థిరతను తీసుకురావాలని ఆకాంక్షించారు. నేటి తరం కోరుకునే హుందాతనాన్ని ప్రదర్శిస్తూనే, దౌత్యపరమైన వ్యూహాలతో భారత్ తన గొంతుకను బలంగా వినిపించింది. ఇది కేవలం మర్యాద పూర్వక సంభాషణ మాత్రమే కాదు, క్లిష్ట సమయాల్లో పొరుగు దేశాలతో భారత్ కొనసాగిస్తున్న క్రియాశీలక పాత్రకు నిదర్శనం.

ముఖ్యంగా ఈ చర్చల్లో ప్రాంతీయ మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించడం గమనార్హం. ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో నెలకొన్న అస్థిరత కేవలం అక్కడి దేశాలకే కాకుండా, ప్రపంచ సరఫరా గొలుసులకు పెద్ద ముప్పుగా పరిణమించింది. కీలకమైన రవాణా మార్గాలపై దాడులు జరగడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందని మోదీ హెచ్చరించారు. షిప్పింగ్ లేన్ల రక్షణ,



నౌకాయాన స్వేచ్ఛను కాపాడటం ఎంత ముఖ్యమో ఆయన ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, వాణిజ్య మార్గాలను సురక్షితంగా ఉంచడం వల్లనే సామాన్యుడికి నిత్యావసరాలు అందుతాయనే వాస్తవాన్ని ప్రధాని తన మాటల్లో స్పష్టం చేశారు.

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేసినప్పటి నుండి ఈ ప్రాంతంలో పరిస్థితి విషమించింది. దీనికి ప్రతిచర్యగా ఇరాన్ కూడా పొరుగు దేశాలు, ఇజ్రాయెల్‌ను లక్ష్యం చేసుకోవడంతో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. ఈ క్రమంలోనే ప్రపంచ ఇంధన అవసరాల్లో 20 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తన నియంత్రణలోకి తీసుకోవడం ప్రపంచ దేశాలను ఆందోళనకు...

మిగతా 2లో...

## ఆరు గ్యారెంటీల అమలుకు

# ప్రైవేట్ బిల్లు

02



- కాంగ్రెస్ హామీల అమలు కోరేందుకు విమర్శలు
- న్యాయ నిపుణులతో సమావేశం
- అనంతరం బిల్లుకు రూపకల్పన
- స్పీకర్, చైర్మన్‌లను కలిసి బిల్లుకు అనుమతి కోరనున్నట్లు వెల్లడి
- అన్ని వర్గాల ప్రజల తరఫున బిల్లును ప్రతిపాదిస్తున్నామని స్పష్టం

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు, న్యాయ నిపుణులు, లీగల్ సెల్ సభ్యులతో సమావేశమై బిల్లుకు తుది రూపం ఇచ్చినట్లు తెలిపారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రవణ్, మాజీ అడ్వకేట్ జనరల్ బి.ఎస్. ప్రసాద్ తదితరులతో చర్చలు జరిపినట్లు చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తొలి రోజే ముఖ్యమంత్రి ఆరు గ్యారెంటీల ఫైల్‌పై సంతకం చేశారని, కానీ ఇప్పటివరకు అమలులో ఎలాంటి పురోగతి..

మిగతా 2లో...



02

## పదవులు కాదు..

## అభివృద్ధి పనులే శాశ్వతం

- ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు
- పేదవాడి సొంతింటి కల నెరవేరినప్పుడే మనకు గౌరవం
- మంత్రి వాకిటి శ్రీహరి
- అమరచింత మున్సిపల్ పాలక మండలి బాధ్యతల స్వీకారణ

## ఇరాన్ క్షిపణి దాడిలో తెలంగాణవాసి మృతి



- ప్రకటించిన విదేశాంగ శాఖ
- సౌదీ అరేబియాలో ఘటన

03


## మొన్న భార్య..

## నేడు భర్త ఆత్మహత్య

- భార్య మృతితో మనస్తాపంతో ఉరేసుకొని ఎస్ఐ బలవన్మరణం
- ఐదు రోజుల వ్యవధిలోనే విషాదం మిగిల్చిన ఇరువురి మృతి
- తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలైన ఇద్దరు పిల్లలు

02

## పెంపుడు జంతువుల కోసం ఇద్దరు యువతుల ఆత్మహత్య



- హైదరాబాద్‌లో విషాద ఘటనలు

02

# జీవన్‌రెడ్డిని బుజ్జగించిన మంత్రులు

### తగ్గని సీనియర్ నేత

- 25న కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై?
- బీఆర్ఎస్‌లో చేరుతారని ప్రచారం



**గోల్కొండ టైమ్స్, కరీంనగర్ :**

నలభై ఏళ్ల పాటు కాంగ్రెస్ జెండాను మోసిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి ఇప్పుడు పార్టీని వీడే దిశగా అడుగులు వేస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో తనకు చిరకాల ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను పార్టీలోకి చేర్చుకోవడం, ఆపై ఆయనకే ప్రాధాన్యత ఇవ్వడంపై జీవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తనకు పార్టీలో గౌరవం లేదని, అవమానాలు ఎదురవుతున్నాయని భావిస్తున్న ఆయన, ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్‌కు అధికారికంగా రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయన ఇంటి వద్ద కాంగ్రెస్ ఫ్లెక్సీలను అనుచరులు తొలగించడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తోంది.

**తగ్గని జీవన్‌రెడ్డి...**

జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ అధిష్టానం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయనతో గంటల తరబడి చర్చలు జరిపారు. పార్టీలో మీ ప్రాధాన్యత తగ్గదు, తగిన గుర్తింపు ఇస్తాం అని మంత్రులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ, ఆయన మనసు మార్చుకోలేదని తెలుస్తోంది. తన సొంత కేడర్‌కు అన్యాయం జరుగుతున్నప్పుడు పదవుల్లో కొనసాగడం వృథా అని ఆయన మంత్రుల..

మిగతా 2లో...

## జీవన్‌రెడ్డి వస్తే భుజాలపై మోసుకెళ్తా

- ఆయన మంచి మనస్తత్వం ఉన్న వ్యక్తి
- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్
- కాంగ్రెస్ నేత వ్యక్తిత్వంపై ప్రశంసలు



కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డిపై కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రశంసలు కురిపించారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తానంటే తానే భుజాలపై మోసుకెళ్తానని, ఆయన వంటి అవినీతి లేని నేతలు రాజకీయాలకు అవసరమని వ్యాఖ్యానించారు. - గోల్కొండ టైమ్స్, జగిత్యాల

## సర్ పై పోరాటాన్ని కొనసాగిస్తా

- సీఎం మమతా బెనర్జీ
- బీజేపీ నేతలే అసలైన చొరబాటుదారులంటూ వ్యాఖ్య


**కోల్‌కతా :** ఎన్నికల వేళ.. పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అక్రమ వలసల అంశాన్ని అస్త్రంగా చేసుకుని బీజేపీ విమర్శలు చేస్తోంది. సీఎం మమతా బెనర్జీ కూడా అంతే బలంగా కౌంటర్ ఇస్తున్నారు. శనివారం కోల్‌కతాలో నిర్వహించిన ఈద్ వేడుకల్లో ఆమె పాల్గొని బీజేపీ నేతలే అసలైన చొరబాటుదారులంటూ వ్యాఖ్యలు చేశారు. బెంగాల్‌ను టార్గెట్ చేసేవారు నరకానికి వెళ్తారని తెలిపారు. మతం పేరుతో విభజన రాజకీయాలు చేసేవారిని ప్రజలు క్షమించరని హెచ్చరించారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజల హక్కులను హరించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. వాటిని తాను అడ్డుకుంటానని మమతా బెనర్జీ హెచ్చరించారు. తమ ప్రభుత్వాన్ని బలహీనపరచేందుకు కేంద్రం వివిధ మార్గాల్లో...



మిగతా 2లో...

## ఆధునిక యుద్ధం..సరిహద్దులు దాటింది

- ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలు కూడా జాతీయ భద్రతలో భాగమయ్యాయి
- వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉంది
- ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తి అభివృద్ధి
- అధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కృషి
- కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ :** నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం యుద్ధం సరిహద్దులను దాటిందని.. ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలు కూడా జాతీయ భద్రతలో భాగమయ్యాయని అన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి పౌరుడు అన్ని వేళలా దేశ రక్షణ కోసం సన్నద్ధమై ఉండాలని...

మిగతా 2లో...

# నేడు రైతు భరోసా నిధుల విడుదల

మొదటి పేజీ తరువాయి..

తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 70 లక్షల మంది అన్నదాతలకు పెద్ద ఊరటనివ్వనుంది.

**మూడు విడతల్లో రైతు భరోసా నిధులు..**

ఈ పథకం అమలును ప్రభుత్వం మూడు విడతల్లో పూర్తి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. మొదటి విడతగా ఈ నెల 22న ఎకరం వరకు భూమి ఉన్న రైతులకు సుమారు రూ.3,590 కోట్ల నిధులను పంపిణీ చేస్తారు. ఆ తర్వాత 20 రోజుల వ్యవధిలో ఏప్రిల్ రెండో వారంలో (సుమారు ఏప్రిల్ 9 లేదా 10వ తేదీల్లో) రెండో విడతగా రూ.2,650 కోట్లను జమ చేస్తారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి మిగిలిన రైతులందరికీ మూడో విడత నిధులు అందజేయడం ద్వారా మొత్తం రూ.9,000 కోట్ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభం...**

తెలంగాణలో ఇప్పుడు అందరి దృష్టి సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి ఇప్పటికే మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ప్రకారం ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ఆయన నర్మేట చేరుకుంటారు. అక్కడ భారీ వ్యయంతో ఏర్పాటు చేసిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభించి, దానికి గుర్తుగా పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. ఈ ఫ్యాక్టరీ రాకతో స్థానిక రైతులకు తమ పంటను అమ్ముకోవడానికి రవాణా ఖర్చులు తగ్గి, మార్కెటింగ్ సౌకర్యం మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకుని ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు భవిష్యత్తులో మంచి రోజులు రానున్నాయి.

అలాగే తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి ఆయిల్ రిఫైనరీకి కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఇది రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఊపునిచ్చే అంశం. ఆయిల్ ఫామ్ గెలల నుంచి నూనె తీయడమే కాకుండా, దానిని శుద్ధి చేసే రిఫైనరీ కూడా ఇక్కడే అందుబాటులోకి వస్తే రైతులకు మరింత అదనపు లబ్ధి చేకూరుతుంది. ఈ రిఫైనరీ నిర్మాణం పూర్తయితే దిగుమతులపై ఆధారపడటం తగ్గి, స్వయం సమృద్ధి దిశగా తెలంగాణ అడుగులు వేస్తుంది. ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టును ప్రారంభించడం వెనుక ఉన్న ఉద్దేశం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమేనని అధికారులు చెప్తున్నారు. ఫ్యాక్టరీ ప్రాంగణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శన స్టాల్స్‌ను కూడా ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. అక్కడ సాగులో వస్తున్న ఆధునిక మార్పులను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలిస్తారు. రైతులు తమ పంట దిగుబడిని పెంచుకోవడానికి అవసరమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. ఈ స్టాల్స్ సందర్శన అనంతరం ముఖ్యమంత్రి అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ సభ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, భవిష్యత్తు కార్యాచరణను ఆయన వివరించే అవకాశం ఉంది.


నర్మేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ

**సీఎం పర్యటనపై నిరంతరం సమీక్ష...**

సీఎం పర్యటన నేపథ్యంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌తో కలిసి భద్రతా ఏర్పాట్లను వారు స్వయంగా పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా, జనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. వేలాదిగా తరలివచ్చే ప్రజలకు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. గత మూడు రోజులుగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో రైతు మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూడా వేలాది మంది రైతులు తరలివస్తున్నారు. వ్యవసాయం అంటే కేవలం పంట వేయడమే కాకుండా, దాన్ని ఒక లాభసాటి వ్యాపారంగా ఎలా మార్చుకోవాలో ఈ మహోత్సవాల ద్వారా రైతులకు వివరిస్తున్నారు. రైతన్నలు ఉత్సాహంగా పాల్గొంటూ నూతన సాగు పద్ధతులపై అవగాహన పెంచుకుంటున్నారు. ప్రభుత్వం రైతుల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఒక విజ్ఞాన గనిగా మారింది.

**ఆకట్టుకుంటున్న స్టాల్స్..**

రైతు మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన నూట యాభై స్టాల్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇందులో వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన యంత్రాలను ప్రదర్శిస్తున్నారు. డ్రోన్ల ద్వారా మందుల పిచికారీ, ఆధునిక ట్రాక్టర్లు, కొత్త యంత్రాల పనితీరును రైతులకు ప్రత్యక్షంగా చూపిస్తున్నారు. ఆయిల్ ఫామ్ తోటల పెంపకంలో తీసుకోవాల్సిన మెలుకువలు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే మార్గాలను ఇక్కడ వివరిస్తున్నారు. ఈ స్టాల్స్ సందర్శించడం వల్ల రైతులకు తమ పంటలపై సరికొత్త ఆలోచనలు కలుగుతున్నాయి. ప్రస్తుత తరం రైతులు ఆధునిక సాంకేతికత వైపు మళ్లడానికి ఇది మంచి వేదికగా మారింది.

కేవలం పంటలకే పరిమితం కాకుండా ఉద్యానవన, పాడి పరిశ్రమ, మత్స్య రంగాల వంటి అనుబంధ రంగాలపై కూడా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మన రాష్ట్ర వాతావరణం ఆయిల్ ఫామ్ సాగుకు అనుకూలంగా ఉండటంతో, రైతులు ఈ పంట వైపు మళ్లేలా ప్రోత్సాహకాలు అందిస్తోంది. పంట పండిన వెంటనే ఫ్యాక్టరీకి తరలించే అవకాశం ఉండటంతో రవాణా భారం తప్పుతుంది. ఇలాంటి పరిశ్రమలు గ్రామీణ ప్రాంతాల్లో రావడం వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయి.

# షిప్పింగ్ మార్గాలపై దాడులు వద్దు

మొదటి పేజీ తరువాయి..

గురిచేస్తోంది. గత కొద్ది రోజులుగా ఇక్కడి నుంచి నౌకల రాకపోకలను ఇరాన్ పరిమితం చేయడంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలపై ఆ ప్రభావం పడుతోంది. ఇలాంటి సంక్లిష్ట సమయంలో ఇరాన్ అధ్యక్షుడితో మోదీ మాట్లాడటం, శాంతి మార్గంలో పయనించాలని సూచించడం భారత దౌత్య విజయం గానే భావించాలి.

ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయ పౌరుల భద్రత విషయంలో ఆ దేశం అందిస్తున్న మద్దతును ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. ఏ దేశంలోనైనా సంక్షోభం తలెత్తినప్పుడు అక్కడ ఉన్న తమ వారి క్షేమమే భారత్‌కు మొదటి ప్రాధాన్యత. ఇరాన్ నాయకత్వం భారతీయుల పట్ల చూపుతున్న సానుకూల దృక్పథం ఇరు దేశాల మధ్య ఉన్న చారిత్రక సంబంధాలను ప్రతిబింబిస్తోంది. సంక్షోభం మొదలైనప్పటి నుండి మోదీ ఇతర దేశాధినేతలతో కూడా నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. కేవలం ఇరాన్ మాత్రమే కాకుండా సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, ఫ్రాన్స్ వంటి దేశాలతో చర్చలు జరపడం ద్వారా ఈ సమస్యకు ఒక సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనాలని భారత్ గట్టిగా ప్రయత్నిస్తోంది.

ప్రస్తుత భద్రతా పరిస్థితులపై ప్రధాని మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ఏవైనా వివాదాలు ఉంటే వాటిని చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలని పునరుద్ఘాటించారు. యుద్ధం ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదని, అది కేవలం విధ్వంసాన్ని మాత్రమే మిగులుస్తుందని భారత్ ఎప్పుడూ నమ్ముతుంది. మార్చి 12న జరిగిన చర్చల్లో కూడా పెజెష్కియాన్ తన వైఖరిని వివరించగా, మోదీ శాంతి మంత్రాన్నే పఠించారు. ఆధునిక ప్రపంచంలో దేశాల మధ్య పరస్పర సహకారం లేకపోతే అభివృద్ధి సాధ్యం కాదని, హింస వల్ల సాధారణ ప్రజానీకం తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ చర్చలు ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా, అంతర్జాతీయ వేదికపై భారత్ ఒక బాధ్యతాయుతమైన దేశమని చాటిచెప్పాయి. కాగా ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20 శాతం మేర జరిగే హార్మూజ్ జలసంధిని తన నియంత్రణలోకి తీసుకుంది. దీనితో ప్రపంచవ్యాప్తంగా చమురు సహా మిగతా ఇంధన సమస్యలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ కొన్ని ఎంచుకున్న చమురు నౌకలను మాత్రమే హార్మూజ్ గుండా వెళ్లేందుకు అనుమతి ఇస్తోంది.

# జీవన్‌రెడ్డిని బుజ్జగించిన మంత్రులు

మొదటి పేజీ తరువాయి..

వద్ద కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. దాదాపు గంటన్నర పాటు జరిగిన ఈ భేటీ నిష్ఫలమైందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

**బీఆర్ఎస్‌లో చేరుతారని ప్రచారం...**

ఈ పరిణామాల నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు జీవన్‌రెడ్డిపై కన్నేశాయి. అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ ఆయనను తమ పార్టీలోకి ఆహ్వానించేందుకు పావులు కదుపుతున్నాయి. ఆయన వంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నాయకుడి కోసం గట్టి ప్రయత్నాలే చేస్తోందని తెలుస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో జీవన్ రెడ్డి టచ్‌లోకి వెళ్లారని, 25న రాజీనామా చేసిన వెంటనే జగిత్యాలలో భారీ బహిరంగ సభ ద్వారా గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ కూడా జీవన్‌రెడ్డి సీనియారిటీని గౌరవించి, ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి.

# జీవన్‌రెడ్డి వస్తే భుజాలపై మోసుకెళ్తా

**ఆయన మంచి మనస్తత్వం ఉన్న వ్యక్తి**

**కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**

**కాంగ్రెస్ నేత వ్యక్తిత్వంపై ప్రశంసలు**

**గోల్కొండ టైమ్స్, జగిత్యాల:**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో సీనియర్ నేత టి. జీవన్ రెడ్డి చుట్టూ తిరుగుతున్న పరిణామాలపై కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జీవన్‌రెడ్డి వ్యక్తిత్వంపై ప్రశంసలు కురిపిస్తూనే, ఆయనకు తమ పార్టీలోకి సాదర స్వాగతం పలుకుతామని స్పష్టం చేశారు. జీవన్‌రెడ్డి చాలా మంచి మనస్తత్వం ఉన్న వ్యక్తి అని, ఆయనంటే తనకు అపారమైన గౌరవం ఉందని పేర్కొన్నారు. 'రాజకీయాల్లో అవినీతి అంటే తెలియని వ్యక్తి జీవన్‌రెడ్డి. ఆయన లాంటి నిఖార్సైన నేతలు రాజకీయాల్లో ఉండాలి' అని కొనియాడారు.

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో జీవన్ రెడ్డి ఎదుర్కొంటున్న అవమానాలు, అసంతృప్తి నేపథ్యంలో సంజయ్ స్పందిస్తూ.. "జీవన్ రెడ్డి ఒకవేళ బీఆర్ఎస్‌లోకి వస్తానంటే, నేనే స్వయంగా ఆయనను నా భుజాలపై మోసుకెళ్తాను" అని వ్యాఖ్యానించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ (కాంగ్రెస్) అనుచరుల జోక్యంపై జీవన్ రెడ్డి గుర్రుగా ఉన్న తరుణంలో, ప్రత్యర్థి పార్టీ ఎమ్మెల్యే అయిన కల్వకుంట్ల సంజయ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తన నియోజకవర్గంలో ఇతర పార్టీల నేతల చేరికలు, తన ప్రాధాన్యత తగ్గడంపై జీవన్ రెడ్డి ఇప్పటికే హైకమాండ్ వద్ద తన నిరసనను వ్యక్తం చేశారు. ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు కూడా ఆయనను పార్టీలోకి బహిరంగంగా ఆహ్వానిస్తుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

# ఆగమశాస్త్రానుసారమే భద్రాచలం అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి..

తొలి దశ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల ప్రణాళికలకు అనుగుణంగా ఆలయ సమీపంలోని పుష్కర ఘాట్ల నిర్మాణం, అభివృద్ధి పనులు జరగాలని చెప్పారు. 2027 మార్చి 31 నాటికి తొలిదశ అభివృద్ధి పనులు పూర్తి చేసే లక్ష్యంతో పనులు జరగాలని సూచించారు. పుష్కరాలు ముగిసిన అనంతరం మిగతా పనులు పూర్తి చేసేందుకు కూడా ఇప్పుడే ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# పెంపుడు జంతువుల కోసం ఇద్దరు యువతుల ఆత్మహత్య

## హైదరాబాద్‌లో విషాద ఘటనలు

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలో ఇటీవల చోటుచేసుకున్న రెండు విషాద ఘటనలు సమాజాన్ని కలచివేశాయి. సాధారణంగా మనుషులు ఎంతో ప్రేమగా పెంచుకునే పెంపుడు జంతువులే కొన్ని సందర్భాల్లో భావోద్వేగాలకు కారణమై తీవ్రమైన నిర్ణయాలకు దారి తీస్తున్నాయని ఈ ఘటనలు చూపిస్తున్నాయి. గడిచిన వారం రోజుల్లో పిల్లులతో సంబంధం ఉన్న భావోద్వేగ సంఘటనల కారణంగా ఇద్దరు యువతులు ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. వివరాల్లోకి వెలితే.. అల్వాల్ ప్రాంతంలో నివసిస్తున్న కుసుమలత, దేవదత్తం దంపతుల కుమార్తె శ్రేష్ఠ ఎంబీబీఎస్ చదువుతోంది. ఆమె భవిష్యత్తు కోసం కష్టపడుతూ పీజీ పరీక్షలకు సిద్ధమవుతోంది. అయితే ఇంట్లో పెంచుతున్న పిల్లి విషయంలో ఆమెకు తన తల్లితో చిన్నపాటి వాగ్వాదం జరిగింది. పిల్లిని ఇంట్లోకి తీసుకురావద్దని తల్లి మందలించడంతో శ్రేష్ఠ తీవ్రంగా మనస్తాపానికి గురైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు తమ కూతురిని ఆ స్థితిలో చూసి షాక్‌కు గురయ్యారు. చిన్న గొడవ ఇంత పెద్ద విషాదానికి దారితీసిందని స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

ఇదే సమయంలో మరో ఘటన మీర్‌పేట్‌లో చోటుచేసుకుంది. హిమబిందు అనే యువతి తన కుటుంబంతో కలిసి అక్కడ నివసిస్తోంది. ఆమె గత రెండేళ్లుగా ఒక పిల్లిని ఎంతో ప్రేమగా పెంచుకుంటోంది. ఆ పిల్లిని కుటుంబ సభ్యుల కంటే ఎక్కువగా చూసుకునేది. అయితే ఆ పిల్లి ఇటీవల మరణించింది. తాను పెంచుకుంటున్న పిల్లి మృతిని ఆమె తట్టుకోలేకపోయింది. తీవ్ర భావోద్వేగానికి లోనైన హిమబిందు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.



# ప్రజల సుఖశాంతి కోసం ప్రత్యేక పూజలు

## తోటకూర వజ్రేష్ యాదవ్

**గోల్కొండ టైమ్స్, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా పోచారం డివిజన్‌లోని ప్రతాపసింగారంలో నిర్వహించిన గుబ్బరి గట్టు మైసమ్మ ఎల్లమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవంలో జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఆయన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో తోటకూర వజ్రేష్ యాదవ్ భక్తిశ్రద్ధలతో పాల్గొని, ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# సర్‌పై పోరాటాన్ని కొనసాగిస్తా

మొదటి పేజీ తరువాయి..

ఒత్తిడి తెస్తోందని, అవసరమైతే రాష్ట్రపతి పాలన విధించాలనే యత్నాలు కూడా జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. అయినప్పటికీ, ఈ చర్యలకు తాము భయపడబోమని ధైర్యంగా ప్రకటించారు.

అదేవిధంగా ఓట్లు చీల్చేందుకు కొందరు వ్యక్తులు బీజేపీ నుంచి డబ్బులు తీసుకుంటున్నారని కూడా ఆమె ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ అంశంపై తన పోరాటం కొనసాగుతుందని, ప్రతి పౌరుడి ఓటు హక్కును రక్షించడంలో వెనుకడుగు వేయనని ఆమె స్పష్టం చేశారు.



**రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాస్తూ..**

ప్రధాని మోదీ దేశంలో అతిపెద్ద చొరబాటుదారులని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాస్తూ ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వలసల అంశాన్ని రాజకీయం చేస్తూ బెంగాల్ అస్తిత్వాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని, దీన్ని తాము సహించబోమని స్పష్టం చేశారు.

**సర్‌పై పోరాటం..**

ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై తన పోరాటం కొనసాగిస్తానని మమత చెప్పారు. ప్రజల హక్కులు లాక్కోవడానికి మోదీ చేసే ప్రయత్నాలను అడ్డుకుంటానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే టీఎంసీ ప్రధాన లక్ష్యమన్నారు. 'సర్' పేరుతో రాష్ట్రంలోని అనేకమంది ప్రజల పేర్లను తొలగించారని మండిపడ్డారు. దీనిపై ప్రశ్నిస్తూ కులం, వర్ణంతో సంబంధం లేకుండా బెంగాల్ ప్రజలందరికీ తోడుగా నిలబడ్డానని చెప్పారు.

'సర్'పై తన పోరాటాన్ని కొనసాగిస్తానని తేల్చిచెప్పారు. ప్రజల హక్కులను లాక్కోవడానికి ప్రధాని చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటానని తెలిపారు. తమ ప్రభుత్వాన్ని నియంత్రించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రపతి పాలన విధించాలని చూస్తోందని ఆరోపించారు. అయినా వీటన్నింటికీ తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీపై మమతా పలు విమర్శలు చేశారు. ఓట్లు చీల్చేందుకు కొందరు ద్రోహులు బీజేపీ నుంచి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు.

**మమత అందుకు అనర్హురాలు..**

ప్రధాని మోదీపై సీఎం మమతా బెనర్జీ చేసిన ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగబద్ధమైన పదవికి ఆమె అనర్హురాలు అని తెలిపింది. మోదీ మైనార్టీల వ్యతిరేకి అంటూ మమత విమర్శలు చేయడంపై బీజేపీ నేత శిశిర్ బజోరియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయం సీఎం మమతను వెంటాడుతోందని ఎద్దేవా చేశారు.

# ఆరు గ్యారెంటీల అమలుకు ప్రైవేట్ బిల్లు

మొదటి పేజీ తరువాయి..

లేదన్నారు. సుమారు 800 రోజులు గడిచినా గ్యారెంటీల అమలు జరగకపోవడంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ బిల్లును ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఈ బిల్లును రాబోయే శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. స్పీకర్, శాసన మండలి చైర్మన్‌లను కలిసి బిల్లుకు అనుమతి ఇవ్వాలని కోరనున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు.

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేట్ మెంబర్ బిల్లులను ప్రభుత్వం ఆమోదించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తు చేశారు. అందువల్ల ఈ బిల్లుకు కూడా అనుమతి ఇవ్వాలని సూచించారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, దివ్యాంగులు, ప్రభుత్వ ఉద్యోగులు వంటి అన్ని వర్గాల ప్రజల తరఫున ఈ బిల్లును ప్రతిపాదిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000 పెన్షన్, రైతులకు రూ.15,000 ఆర్థిక సహాయం, విద్యార్థులకు విద్యా భరోసా కార్డు వంటి హామీలను చట్టబద్ధం చేయడమే లక్ష్యమని చెప్పారు.

ఈ బిల్లు చట్టంగా మారితే లబ్ధిదారులకు హక్కులు కలుగుతాయని, ప్రభుత్వం హామీలు అమలు చేయకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రజలు దరఖాస్తులు లేకుండా నేరుగా లబ్ధి పొందే విధానం ఏర్పడుతుందని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల మద్దతు తీసుకునే ప్రయత్నం చేస్తామని, అవసరమైతే ప్రజల నుంచి సూచనలు స్వీకరించి బిల్లులో చేర్చుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లును ఆమోదించకపోతే చట్టపరమైన ఇతర మార్గాలు అనుసరిస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ హక్కుల కోసం స్థానిక ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకురావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్

## తోటకూర వజ్రేష్ యాదవ్

**గోల్కొండ టైమ్స్, మేడ్చల్ :**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ పవిత్రతకు, మత సామరస్యానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. కీసర సర్కిల్ శామీర్‌పేట్ డివిజన్‌లో జరిగిన రంజాన్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్దీన్, మేడ్చల్ మల్కాజిగిరి సేవాదళ్ అధ్యక్షుడు మహమ్మద్ షాఫివుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, రంజాన్ మాసంలో ఉపవాసాలు ఆచరించడం ద్వారా సహనం, సేవాభావం, దాతృత్వం పెంపొందుతాయని అన్నారు. తెలంగాణలో అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి పండుగలు జరుపుకోవడం మన సంస్కృతికి నిదర్శనం అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్.టి సెల్ చైర్మన్ బిలియా నాయక్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ చైర్మన్ జితేందర్ రెడ్డి, సికింద్రాబాద్ డీసీసీ నాయకుడు దీపక్ జాన్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహా యాదవ్, జిల్లా ఆర్‌టీఓ మెంబర్ జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షుడు తుంకి రమేష్, మున్సిపల్ చైర్మన్ శిరీష కృష్ణ రెడ్డి, స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పదవులు కాదు.. అభివృద్ధి పనులే శాశ్వతం

- ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు
- పేదవాడి సొంతింటి కల నెరవేరినప్పుడే మనకు గౌరవం
- మంత్రి వాకిటి శ్రీహరి

**గోల్కొండ టైమ్స్, మక్తల్ :**

పదవులు శాశ్వతం కాదని, మనం చేసిన అభివృద్ధి పనులే శాశ్వతమని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మక్తల్ నియోజకవర్గం అమరచింత మున్సిపల్ పాలక మండలి సభ్యుల పదవీ బాధ్యతల స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నారు. ప్రజల ఆశీర్వాదం తో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ప్రజా సేవకు పునరంకితం అవ్వాలని ఉద్ఘాటించారు. పదవులు శాశ్వతం కాదని మనం చేసిన అభివృద్ధి పనులు మాత్రమే శాశ్వతమని నూతనంగా ఎన్నికైన సభ్యులను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని ఓమ్ము చేయకుండా పని చేయాలని హితవు పలికారు. తాను అలుపెరగకుండా అభివృద్ధి కి కట్టుబడి పని చేస్తున్నానని తెలిపారు. రాజకీయాల్లో కింది స్థాయి నుండి వచ్చిన వ్యక్తిని అని స్పష్టం చేశారు. వాగ్దానం చేసిన పనులు పూర్తి చేసే బాధ్యత నాదన్నారు.



ప్రజా ప్రభుత్వంలో ఇరిగేషన్, ఎడ్యుకేషన్ కు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బీడీ, చేనేత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అమరచింత మండలంలో కొత్త గోదాముల నిర్మాణాలు చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. వై ఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత మళ్ళీ ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతున్నట్లు స్పష్టం చేశారు. మండలంలో ఇప్పుడు మంజూరు అయిన 450 ఇందిరమ్మ ఇళ్ళు పూర్తైతే మరో 500 ఇండ్లు ఈ మండలానికి మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు. పేద వాడి ఇంటి నిర్మాణానికి వ్యక్తిగతంగా నేను సహాయం చేస్తానని హామీనిచ్చారు.

కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్ లు మీ వార్డుల్లో పేద వాడికి ఇళ్ళు కట్టించినప్పుడే మీరు నాకిచ్చే గౌరవం అని మంత్రి పేర్కొన్నారు. అమరచింత మండలంలో తాగునీటి సమస్య తీర్చేందుకు వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నామ ని తెలియజేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను పూర్తి చేసి తీరుతామన్నారు. నాపై నమ్మకం ఉంచి గెలిపించిన అమరచింత మండల ప్రజలకు సేవ చేయడం గొప్ప అదృష్టం గా భావిస్తున్నానని మంత్రి శ్రీహరి స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కల్లు గీత సెల్ చైర్మన్ నాగరాజు గౌడ్, అమరచింత మున్సిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ, వైస్ చైర్ పర్సన్ రాధా అరుణ్,, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ నూరుల్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక యుద్ధం..సరిహద్దులు దాటింది

మొదటి పేజీ తరువాయి..

పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు.

ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగానే సాయుధ దళాలకు అధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశ రక్షణలో యువత కూడా తమ వంతు పాత్ర పోషించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొగలిగేలా క్రమశిక్షణ, మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలన్నారు. సైన్యం, పౌరులు బలంగా ఉన్నప్పుడే దేశం ముందడుగు వేస్తుందన్నారు.



**ఎన్‌సీసీలో ప్రవేశాల సామర్థ్యం పెంపు..**

దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రజా–ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**'నారీ శక్తి'కి ఊతం..**

సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతుండడాన్ని చరిత్రాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. ఈ నిర్ణయం దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. బాలికా క్యాడెట్లు తమ సామర్థ్యాలను నిరంతరం నిరూపించుకుంటున్నారని, వివిధ రంగాలలో భవిష్యత్ నాయకులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు.

# ప్రజా ప్రభుత్వంలో సామాజిక అన్యాయంగా బడ్జెట్

> తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దిక్సూచిగా మార్చి.20. 2026 న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి ఐన మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్, ఎలా ఉంది అనగా ఒక్క మాటలో చెప్పాలంటే "ప్రజా పాలన" పేరుతో 10% అగ్రకుల పాలకవర్గాలకి బడా కార్పొరేట్ వ్యక్తులకి అనుకూలమైనదిగా, 90% అణగానే వర్గాలకు మరియు సామాజిక న్యాయానికి పూర్తి వ్యతిరేకమైన బడ్జెట్ గా చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. బడ్జెట్ ముఖ్యాంశాలు పూర్తిగా పరిశీలిస్తే అంకెల్లో గారడీ తప్ప, సగటు మనిషి జీవితంలో రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్యబద్ధంగా సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరివర్తన తీసుకొచ్చిదిగా బడ్జెట్ లేకపోవడం గమనార్హం.

ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క 3,24,234 కోట్ల భారీ వ్యయంతో 2026-27 బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.రెవెన్యూ వ్యయం 2,34,406 కోట్లు.మూలధన వ్యయం 47,267 కోట్లు (మౌలిక సదుపాయాల కల్పన కోసం).ఆరు గ్యారంటీలకు కేటాయింపులో భాగంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 ప్రధాన వాగ్దానాల అమలు కోసం ఈ బడ్జెట్‌లో 50,713 కోట్లు కేటాయించారు. గత ఏడాది సుమారు 56,000 కోట్లు కేటాయించినప్పటికీ, నిధుల లభ్యత మరియు అప్పుల భారం వల్ల క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి అమలుకు కొంత ఆర్థిక అంతరం ఏర్పడుతోందని మేధావులు సామాజిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సామాజిక వర్గాల వారీగా కేటాయింపులు ఒక్కసారి క్షుణ్ణంగా గమనిస్తే సమానత్వం ఎక్కడ.? తెలంగాణలో ఇటీవల జరిగిన కుల గణన (Caste Survey 2025) ప్రకారం బీసీ (56.33%), ఎస్సీ (17.43%), ఎస్టీ (10.45%) జనాభా దాదాపు 85% పైగా ఉంది. జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్ పంపిణీ జరగాలనేది సామాజిక న్యాయ నినాదం. కానీ రాష్ట్ర ప్రస్తుత నూతన బడ్జెట్ లో సామాజిక వర్గాల వారీగా కెటాయింపులు చూస్తే 53% ఉన్న బీసీలకు వారి సంక్షేమం కోసం12,511 కోట్లు కేటాయించగా, 17% ఉన్న ఎస్సీలకు వారి సంక్షేమం కోసం11,784 కోట్లు, 10 శాతం ఉన్న ఎస్టీలకు వారి సంక్షేమం7,937 కోట్లు, మత మైనారిటీల సంక్షేమం కోసం 3,769 కోట్లు కేటాయించారు. జనాభాలో 90% గా ఉన్న అణగారిన వర్గాలకు కేటాయించిన మొత్తం (సుమారు 36,000కోట్లు),మొత్తం బడ్జెట్ వ్యయంలో దాదాపు 11-12% మాత్రమే. ఇది జనాభా నిష్పత్తికి (Population Proportion) చాలా దూరంగా ఉంది. రాజ్యాంగబద్ధమైన సమానత్వం సిద్ధించాలంటే, నిధుల పంపిణీ కూడా జనాభా దామాషా ప్రకారం ఉండాల్సిన అవసరం ఉందని సామాజికవేత్తలు వాదిస్తున్నారు. రాజ్యాంగ విలువలతో ఆదర్శ రాష్ట్ర స్థాపన డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశించిన "స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం" అనే పునాదులపై రాష్ట్రం నిర్మించబడాలి. ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాలకు పరిమితం కాకుండా, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలి.

**ఉచిత విద్య & వైద్యం:** బడ్జెట్‌లో విద్యకు, వైద్యానికి పెద్దపీట వేయడం ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుంది. కేవలం భవనాలే కాకుండా, నాణ్యమైన మానవ వనరుల కల్పన ముఖ్యం.

**భూమి & ఉపాధి:** కేవలం నగదు బదిలీ కాకుండా, వ్యవసాయ భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు భూ పంపిణీ చేయడం ద్వారా వారిని ఉత్పత్తిదారులుగా మార్చవచ్చు. అప్పులు లేని అభివృద్ధి: మిగులు బడ్జెట్ దిశగా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయకుండా ఉండాలంటే ఆదాయ వనరుల పెంపు మరియు వ్యయ నియంత్రణ కీలకం.

**సంపద సృష్టి:** పారిశ్రామికీకరణ మరియు ఐటీ రంగాలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం ద్వారా ఆదాయం పెరుగుతుంది.

**పారదర్శకత:** పథకాల అమలులో అవినీతిని అరికడితే, మిగులు నిధులను మౌలిక సదుపాయాలకు మళ్లించవచ్చు. అప్పుల వడ్డీల భారం తగ్గించుకోవడానికి రుణ పునర్వ్యవస్థీకరణ ఒక మార్గం. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర నూతన బడ్జెట్ విద్యా రంగానికి కేటాయించిన నిధులు మొత్తం విద్య సంస్థల్లో ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వడానికి, కొద్దిపాటి మౌలిక సదుపాయాలు కల్పించాలని మాత్రమే సరిపోతాయి తప్ప, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తేవడానికి ఆ నిధులు ఏమాత్రం సరిపోవు. అంతే కాకుండా ప్రభుత్వం చెప్తున్నా ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థలు ఏర్పాటు చేస్తాం అంటున్నారు కానీ వాటిలో అత్యాధునిక సౌకర్యాలతో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి నేటి బడ్జెట్లో కల్పించిన నిధులు ఏమాత్రం సరిపోవు. ఇక వైద్య రంగానికి వస్తే నూతన బడ్జెట్లోని నిధులు మొత్తం కూడా ఆయా ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న ఉద్యోగస్తులకి జీతాలు ఇస్తూ, కొద్దిపాటి మౌలిక సదుపాయాలు కల్పనకి ఆ నిధులు సరిపోతాయి కానీ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఆ నిధులు ఏమాత్రం సరిపోవు. ప్రతి జిల్లాలలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులకి అదనంగా ప్రతి మండల కేంద్రంలో ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో సంపూర్ణమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నూతన వైద్యశాలలని ఏర్పాటు చేయాల్సిన అత్యవసరత తెలంగాణ రాష్ట్రంలో ఉన్నది. కానీ నూతన వైద్యశాల ఏర్పాటుకి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవు. ఇక ఉపాధి విషయానికి వస్తే రాష్ట్రంలో దాదాపుగా 20 లక్షల పైగా నిరుద్యోగులు ఉండగా వారికి నిరుద్యోగ భృతి ఇవ్వడానికి నూతన బడ్జెట్లో ఏమాత్రం నిధులు కేటాయించకపోగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమయంలో నుండి నేటి వరకి నూతన ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ వెయ్యకపోగా గత ప్రభుత్వాలు వేసిన నోటిఫికేషన్ లకు పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు భర్తీ చేశారు తప్ప, ప్రణాళికాబద్ధంగా జాబ్ క్యాలెండర్ వేసి ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి నిబద్ధత లేనట్లుగా నిరూపణ అవుతుంది. ఇక గృహా రంగ విషయానికి వస్తే గత బడ్జెట్ తో పోల్చుకుంటే నేటి బడ్జెట్లో ఇందిరమ్మ ఇళ్లకు తక్కువ నిధులు కేటాయించడం గమనార్హం కాగా నూతనంగా నిర్మించబోయే ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేయడానికి ఏమాత్రం నిధులు సరిపోవు. ఇక వ్యవసాయ రంగానికి వస్తే రైతు భరోసాకి, సన్న వడ్ల ఉత్పత్తి ఇచ్చే అదనప భరోసాకి మాత్రమే సరిపడా నిధులు కేటాయించారు. అయితే రాష్ట్రంలోని పెద్ద, చిన్న తాగునీటి తాగునీటి ప్రాజెక్టులకు వందల, వేల కోట్లు కేటాయించగా అసలు రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రతి సాగునీటి ప్రాజెక్టు కింద అగ్రకుల రాజకీయ వ్యాపారులకి వందల, వేల ఎకరాల భూములు ఉన్నాయి కానీ నిరుపేదలైన సామాన్యులైన మినిమం మూడు ఎకరాల భూమి కూడా లేని అణగారిన వర్గాలకి ప్రభుత్వపరంగా వ్యవసాయ భూమి పంపిణీ చేయకుండా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు వేల కోట్లు కేటాయించి వాటిని మెరుగుపరచడం ద్వారా అణగారిన వర్గాలకు దక్కే లాభం శూన్యమే కదా.!

**కులాల వారీ బడ్జెట్**

సామాజిక న్యాయమే అంతిమ లక్ష్యంగా అన్ని రంగాల్లో అగ్ర కులాలతో పాటు సమానంగా తెలంగాణలోని ప్రతి చిన్న కులానికి సామాజిక న్యాయం అందాలంటే "కులాల వారీ బడ్జెట్ (Caste-wise Sub-plan)" అమలులోకి రావాలి. బడ్జెట్ రూపకల్పనలో అట్టడుగు వర్గాల భాగస్వామ్యం ఉన్నప్పుడే, అది అంబేద్కరిజం ఆశించిన ఆదర్శ రాజ్యంగా మారుతుంది. సంక్షేమం అంటే కేవలం 'సబ్సిడీ' కాదని, అది ప్రతి పౌరుడి 'హక్కు' అని గుర్తించినప్పుడే మానవ అభివృద్ధి సూచీలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుంది. అప్పుడు మాత్రమే కాంగ్రెస్ నేతలు చెప్తున్నా ప్రజా ప్రభుత్వానికి గౌరవం దక్కుతూ సామాజిక న్యాయానికి అడుగులు పడతాయి.

అంతేకానీ రాజకీయ ప్రయోజనాలు కోసం కుల గణన చేసి జనాభా దామాషా ప్రకారం అణగారినే వర్గాలకి బడ్జెట్లో నిధులు కేటాయించకుండా, అగ్రకుల రాజకీయ వ్యాపారులకి లాభం చేకూర్చేలా ఇలాంటి బడ్జెట్ ప్రవేశ పెట్టడం ద్వారా ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలని ఖూనీ చేయబడుతూ సామాజిక అన్యాయం చేసిన ప్రభుత్వంగా తెలంగాణ కాంగ్రెస్ కి అలాంటి అపకీర్తి దక్కుతుంది.ఇకనైనా అన్ని రాజకీయ పార్టీలు పరివర్తన చెంది సామాజిక న్యాయమే ప్రభుత్వాల ధ్యేయంగా ఉంటూ భారత రాజ్యాంగ పీఠికలోని మౌలిక సూత్రాలను సంపూర్ణంగా అమలు చేస్తూ, బడ్జెట్లో జనాభా దామాషా ప్రకారం ప్రతి సామాజిక వర్గానికి సమాన వాటాగా నిధులు కేటాయిస్తే రాష్ట్రం, దేశం అద్భుతంగా మానవ అభివృద్ధి సాధిస్తూ బ్రతికి ఉండగానే ప్రజలకి భూలోక స్వర్గాన్ని చూపెట్టవచ్చును అలాంటి శక్తి భారత రాజ్యాంగ విలువలకి ఉన్నది అనేటి సత్యాన్ని పాలకులు గ్రహించాల్సిన చారిత్రక సత్యం.

> తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దిక్సూచిగా మార్చి.20. 2026 న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి ఐన మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్, ఎలా ఉంది అనగా ఒక్క మాటలో చెప్పాలంటే "ప్రజా పాలన" పేరుతో 10% అగ్రకుల పాలకవర్గాలకి బడా కార్పొరేట్ వ్యక్తులకి అనుకూలమైనదిగా, 90% అణగానే వర్గాలకు మరియు సామాజిక న్యాయానికి పూర్తి వ్యతిరేకమైన బడ్జెట్ గా చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. బడ్జెట్ ముఖ్యాంశాలు పూర్తిగా పరిశీలిస్తే అంకెల్లో గారడీ తప్ప, సగటు మనిషి జీవితంలో రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్యబద్ధంగా సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరివర్తన తీసుకొచ్చిదిగా బడ్జెట్ లేకపోవడం గమనార్హం.



✍ పుల్లెంల గణేష్
(సోషల్, పొలిటికల్ ఏనాలిస్ట్)
+91 9553041549

# ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు



## ప్రముఖ రాజకీయ నాయకులు

**గోల్కొండ టైమ్స్, మెదక్**

పవిత్రమైన రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం లకు,నియోజకవర్గ ప్రజలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పవిత్ర మాసం మనుషుల మధ్య సౌహార్దం, సహనం, సేవాభావం, దాతృత్వం వంటి గొప్ప విలువలను పెంపొందించే పవిత్ర కాలమని ఆయన పేర్కొన్నారు. రంజాన్ నెలలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్షలు మనిషిలో ఆత్మ నియంత్రణను పెంపొందించడమే కాకుండా, సమాజంలో సమానత్వ భావనను బలపరుస్తాయని అన్నారు. పేదవారికి సహాయం చేయడం, పరస్పరం ప్రేమాభిమానాలు పెంచుకోవడం ద్వారా సమాజంలో ఐక్యత మరింత బలపడుతుందని ఆయన ఆకాంక్షించారు.ఈ పవిత్ర పండుగతో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ అభివృద్ధి పథంలో నడవాలని ఆయన కోరారు.

# పత్తి చేనులో పసికందు

**గోల్కొండ టైమ్స్, ఆసిఫాబాద్**



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం వల్లగొండ గ్రామపంచాయతీ సీతానగర్ శివారులో పత్తి చేనులో పసికందును గుడ్డలో కట్టి పడేసిన ఘటన శనివారం కలకలం రేపింది. స్థానికులు ఉదయం పత్తి చేను వైపు వెళ్లగా శిశువు అరుపు వినిపించింది, అటు చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడకి చేరుకొని చేనులో సంచిలో చుట్టి పడేసి ఉన్న ఆడ శిశువును సురక్షితంగా బయటకు తీసి కాగ జ్ నగర్ లోని ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించి ట్రీట్మెంట్ అందించారు . విషయాన్ని బాల సంరక్షణ అధికారి మహేశ్ కి తెలపడంతో సిబ్బందితో ఆయన చేరుకొని ఒక రోజు వయసున్న శిశువును బాల సంరక్షణ కేంద్రానికి తరలించారు.ఈ ఘటనకు సంబంధించి పోలీసులు విచారణ చేపట్టారు.

# సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే పండుగ రంజాన్

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**గోల్కొండ టైమ్స్, శంకర్ పల్లి :**



పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా శంకర్‌పల్లి మండల ప్రజలందరికీ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్ర పండుగ ప్రతి ఇంటిలో శాంతి, సౌభ్రాతృత్వం, ఆనందాన్ని నింపాలని ఆమె ఆకాంక్షించారు. సమాజంలో సోదరభావం మరింత బలపడాలని కోరుతూ రంజాన్ ముబారక్ అన్నారు. రంజాన్ మాసం ఆధ్యాత్మిక పరంగా అత్యంత ప్రాముఖ్యత కలిగినదని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.మత సామరస్యం దేశ అభివృద్ధికి బలమైన పునాది అని అన్నారు. అన్ని మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ కలిసి జీవించాల్సిన అవసరం ఉందని, రంజాన్ పండుగ ఈ ఐక్యతను మరింత బలపరుస్తుందని చెప్పారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలంటే ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవాన్ని పాటించాలని సూచించారు.

# సోదరభావం మరింత బలపడాలి

- రంజాన్ పర్వదినం హృదయపూర్వక శుభాకాంక్షలు
- ఎమ్మెల్యే కాలే యాదయ్య

**గోల్కొండ టైమ్స్, శంకర్ పల్లి :**



పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముస్లిం సోదర సోదరీమణులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అల్లాహ్ దయతో ప్రతి ఇంటిలో శాంతి, సంతోషం, సౌఖ్యం నిండాలని, సమాజంలో సోదర భావం మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు. రంజాన్ పండుగ మనుషుల మధ్య ప్రేమ, పరస్పర గౌరవం, ఐక్యతను పెంపొందించే పవిత్ర సందర్భంగా ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మున్సిపాలిటీ, శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులతో మమేకమై వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, మున్సిపల్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, పరస్పర శుభాకాంక్షలతో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ వేడుకలు ప్రాంతంలో ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచాయి.



# బానోరి లింగంగౌడ్‌కు ఘన నివాళి

**గోల్కొండ టైమ్స్, చేవెళ్ల:**

మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్ట చౌరస్తాలోని స్థూపం వద్ద సిపిఐ దివంగత నేత బానోరి లింగంగౌడ్ 25వ వర్ధంతి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి కే.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభు లింగం, చేవెళ్ల కాంగ్రెస్ లేబర్ సెల్ జనరల్ సెక్రటరీ శివ శంకర్‌గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఎం.సుధాకర్ గౌడ్, సత్తిరెడ్డి తదితరులు మాట్లాడుతూ లింగంగౌడ్ పోరాట స్ఫూర్తి ఈనాటికీ ఆదర్శమని తెలిపారు.కార్యక్రమంలో లింగంగౌడ్ సతీమణి అనసూయ, కుమారులు రాజు, ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ద్రోహి కాంగ్రెస్ సర్కార్

- మార్చి 25న అసెంబ్లీ ముట్టడి
- లంబాడీ హక్కుల పోరాట సమితి

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ గిరిజనుల పాలిట శాపంగా మారిందని, ఇది పూర్తిగా "ప్రజా వ్యతిరేక బడ్జెట్" అని లంబాడి హక్కుల పోరాట సమితి నిప్పులు చెరిగింది. ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ గొప్పగా ప్రకటించిన 'ఎస్సీ, ఎస్టీ చేవెళ్ల డిక్లరేషన్' అటకెక్కిందని, గిరిజనులను నిండా ముంచడమే లక్ష్యంగా ఈ బడ్జెట్ రూపకల్పన జరిగిందని రాష్ట్ర కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

**అంకెలేమో వేల కోట్లు.. ఖర్చు చేసేది శూన్యం**

బడ్జెట్ కేటాయింపులపై ప్రభుత్వం ఆడుతున్న నాటకాలను సమితి బట్టబయలు చేసింది. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 40 శాతం కూడా ఖర్చు చేయని చేతగాని ప్రభుత్వం, ఇప్పుడు మళ్ళీ రూ. 7,937 కోట్లు కేటాయించామని చెప్పడం గిరిజనులను మోసం చేయడమేనని మండిపడింది. గతంలో కేటాయించిన నిధుల్లో రూ. 2,000 కోట్లు కూడా ఖర్చు చేయకుండా, కొత్త అంకెలతో మాయమాటలు చెబుతున్నారని నాయకులు ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీల పేరుతో ఊదరగొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, గిరిజనుల ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని సమితి ఆవేదన వ్యక్తం చేసింది. అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్న డిక్లరేషన్ హామీలు ఇప్పుడు గాలికి వదిలేశారని నాయకులు విమర్శించారు. ఇది గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే బడ్జెట్. నిధులు ఇవ్వకుండా, నీతులు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గిరిజన బిడ్డలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

**మార్చి 25న చలో అసెంబ్లీ**

ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా లంబాడి హక్కుల పోరాట సమితి, సేవాలాల్ సేన, బంజారా సేవా సంఘం సంయుక్తంగా పోరాటాన్ని ఉధృతం చేశాయి. మార్చి 25న అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చాయి. ఈ భారీ ముట్టడిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజనులు, బంజారాలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సమితి పిలుపునిచ్చింది. తమ డిమాండ్లు నెరవేరే వరకు, చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేసే వరకు విశ్రమించేది లేదని, గిరిజన గర్జనతో అసెంబ్లీని స్తంభింపజేస్తామని నాయకులు హెచ్చరించారు.

# ఫీజుల దోపిడీపై రెయిన్‌బో స్కూల్ ముట్టడి

- అమీన్‌పూర్‌లో పేరెంట్స్ ఆందోళన
- యాజమాన్యంపై ఆగ్రహం
- విద్యాశాఖపై విమర్శలు



**గోల్కొండ టైమ్స్, అమీన్పూర్:**

విద్యాలయాలు వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయంటూ అమీన్‌పూర్ లోని రెయిన్‌బో ఇంటర్నేషనల్ స్కూల్ ఎదుట తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఫీజులను అడ్డగోలుగా పెంచి, అదనపు పేర్లతో వసూళ్లు చేస్తున్నారంటూ వందలాది మంది పేరెంట్స్, విద్యార్థులు స్కూల్ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. అడ్మిషన్ సమయంలో ఒక విధంగా చెప్పి, విద్యా సంవత్సరం మధ్యలో ఫీజులు పెంచడం అన్యాయమని తల్లిదండ్రులు ఆరోపించారు. ట్యూషన్ ఫీజులతో పాటు స్పోర్ట్స్ డ్రెస్సులు, స్టడీ మెటీరియల్, డిజిటల్ కిట్లు పేరుతో భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పుస్తకాలు, యూనిఫాంలు బయట కొనుగోలు చేసే హక్కు ఉన్నప్పటికీ, స్కూల్ సూచించిన చోటే కొనాలంటూ ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. ఫీజులపై ప్రశ్నించిన తల్లిదండ్రులకు సరైన సమాధానం ఇవ్వకుండా "నచ్చకపోతే పిల్లలను తీసుకెళ్లండి" అని నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజులు ఆలస్యమైతే విద్యార్థులను తరగతి గది బయట నిలబెట్టి అవమానిస్తున్నారని ఆరోపించారు. "వీ వాంట్ జస్టిస్" అంటూ నినాదాలు చేస్తూ స్కూల్ గేటు ముందు ముట్టడి కొనసాగించారు.

**విద్యాశాఖపై కూడా విమర్శలు..**

ప్రైవేట్ పాఠశాలల ఆగడాలను అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని తల్లిదండ్రులు ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘించి ఫీజులు పెంచుతున్నా చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. రెయిన్‌బో స్కూల్‌పై వెంటనే విచారణ జరిపి ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన చేపడతామని హెచ్చరించారు.

# సమైక్యతా సౌరభం.. రంజాన్ సంబరం!

## ముస్లిం సోదరులతో తుంబూరు దయాకర్ రెడ్డి ఆత్మీయ ఆలింగనం

**గోల్కొండ టైమ్స్, ఖమ్మం :**

భారతీయ జీవన స్రవంతిలో అంతర్భాగమైన గంగా-జమునా తెహజీబ్‌కు నిలువుటద్దంగా, మత సామరస్యానికి మకుటాయమానంగా రంజాన్ పర్వదిన వేడుకలు శనివారం జిల్లా కేంద్రంతో పాటు ఏదులాపురం ప్రాంతంలో మిన్నంటాయి. ఈ సందర్భంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ మద్దులపల్లిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఇందిరమ్మ ప్రభుత్వం మైనారిటీల పక్షపాతి. విద్యా, ఉపాధి రంగాల్లో ముస్లిం సోదరులకు అండగా ఉంటూ, పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే మంత్రి పొంగులేటి లక్ష్యం" అని భరోసా ఇచ్చారు. పండుగ వేళ ఆత్మీయతను చాటుతూ మద్దులపల్లిలోని ఎస్.కె. జానీ నివాసానికి, ఖమ్మం నగరంలోని సీనియర్ నాయకులు ఎస్.కె. ఇమామ్ భాయ్ గృహానికి వెళ్లిన దయాకర్‌రెడ్డి, వారి ఆతిథ్యాన్ని స్వీకరించి ఈద్ ముబారక్ తెలియజేశారు. ఈ వేడుకల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్ గొడ్డుగొర్ల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



# ఇరాన్ క్షిపణి దాడిలో తెలంగాణ వాసి మృతి

**న్యూఢిల్లీ/ గోల్కొండ టైమ్స్, మహబూబాబాద్ :**

సౌదీ అరేబియాపై ఇరాన్ జరిపిన దాడుల్లో ఓ భారతీయుడు మృతి చెందారని విదేశాంగ శాఖ ప్రకటించింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఇప్పటి వరకు వివిధ ఘటనల్లో చనిపోయిన భారతీయుల సంఖ్య ఆరుకు చేరుకుందని, మరొకరు గల్లంతయ్యారని విదేశాంగ శాఖ అధికారి అసీమ్ మహాజన్ శుక్రవారం వెల్లడించారు. భారతీయుడి మృతికి గల కారణాలను మాత్రం వివరించలేదు.

భారత్‌లోని మృతుడి కుటుంబీకులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. వారికి అవసరమైన సాయాన్ని అందిస్తామని వివరించారు. ఈ నెల 18న రాత్రి రియాద్‌లోని లక్ష్యాలపై ఇరాన్ నాలుగు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వీటిని సౌదీ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయి. రియాద్‌లోని ఓ రిఫైనరీ సమీపంలో క్షిపణుల శకలాలు పడ్డాయి. శకలాలు తగలడంతో భారతీయుడు ప్రాణాలు కోల్పోయి ఉంటారని భావిస్తున్నారు.

మృతిచెందిన వ్యక్తి తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్‌కు చెందిన రవిగోపాల్‌గా తెలుస్తోంది. వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ఈ నెల 18 తేదీన రాత్రి. 9.30 గంటలకు చివరి సారిగా రవితో మాట్లాడినట్లు చెప్పారు. 20 నిమిషాలు మాట్లాడిన అనంతరం కాల్ కట్ అయ్యిందని తెలిపారు. తిరిగి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చిందన్నారు. అక్కడే ఉన్న వేరే వారితో మాట్లాడానికి ప్రయత్నించామని, వారు కాల్‌లోకి రాలేదని తెలిపారు.

సౌదీపై జరిగిన దాడుల్లో రవి మృతిచెందినట్లు మరుసటి రోజు రామ్ నివాస్ అనే వ్యక్తి ఫోన్ చేసి తమకు చెప్పినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. తమ కుటుంబంలో రవి ఒక్కరే ఉద్యోగం చేస్తారని తెలిపారు. అతనికి నాలుగేళ్ల కొడుకు ఉన్నారని చెప్పారు. దయచేసి అతడి మృతదేహాన్ని తమకు అప్పగించాలన్నారు. తమకు పరిహారం ఇప్పించాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఎస్‌హెచ్‌జీ మహిళలకు మార్కెట్ వేదిక

## గ్రామీణ భారత్ మహోత్సవం ప్రారంభం

**గోల్కొండ టైమ్స్,రామచంద్రాపురం :**

భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి కాలనీలో నాబార్డ్ సహకారంతో ఈశ్వరాంబ మహిళా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్వయం సహాయక సంఘాల మేళా – గ్రామీణ భారత్ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమాన్ని జిహెచ్ఎంసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి, నాబార్డ్ డీడీఎంలు ఎం.వి. కృష్ణ తేజ, నిఖిల్ రెడ్డి, మెదక్ డీసీసీబీ సీఈఓ సురేష్ ,భారతీనగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. మేళా ద్వారా మహిళా సంఘాల ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, కొనుగోలుదారులతో నేరుగా పరిచయం ఏర్పరచడం, భారీ ఆర్డర్లను పొందే అవకాశం కల్పించడం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. పట్టణ వినియోగదారుల అభిరుచులు, అవసరాలను తెలుసుకునే వేదికగా కూడా ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు – మార్చి 21, 22 తేదీలలో – మేళా కొనసాగనుంది. ఈ సందర్భంగా ఎస్ హెచ్ జి సభ్యులు తమ ఉత్పత్తులను సమర్థవంతంగా విక్రయించుకునే విధానాలపై ఈశ్వరాంబ మహిళా సొసైటీ సభ్యులు మార్గదర్శనం అందించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సత్యవతి, ఎల్ఐజి కాలనీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు



## ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్**

ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద ముస్లింలు భారీ సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ప్రార్థనల అనంతరం ఆయన చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరులందరూ సుఖ సంతోషాలతో, ప్రశాంతంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. రంజాన్ మాసమంతా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగియడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల షాపింగ్ అవసరాలకు, ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశామని, అందరి సహకారంతో వేడుకలు విజయవంతంగా సాగాయని వివరించారు. పండుగ ఏర్పాట్లలో సహకరించిన మత పెద్దలకు, ఇతర ప్రభుత్వ విభాగాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తఫ్సీర్ ఇక్బాల్, (అడి



షనల్ సిపి – సౌత్ రేంజ్), .డి.జోయల్ డెవిస్ ఐపిఎస్ జాయింట్ సిపి ట్రాఫిక్, ఎన్. స్వేతా, ఐపిఎస్ (జాయింట్ సిపి – నార్త్ రేంజ్), శ్రీ.ఆర్.వెంకటేశ్వర్లు ఐపిఎస్ డిసిపి సిఎఆర్ హెడ్ క్వార్టర్స్, ఎస్. శ్రీనివాస్, ఐపిఎస్ (డిసిపి – రాజేంద్ర నగర్ జోన్), అవినాశ్ కుమార్ ఐపిఎస్ డిసిపి ట్రాఫిక్ తదితర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి
జ్యోతిబాపూలే బాలికల గురుకులంలో
వైద్యారోగ్య శిబిరం సందర్శన



**గోల్కొండ టైమ్స్ ,నిజామాబాద్ :**

ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువు, క్రీడలు, ఇతర అంశాలపై చక్కగా దృష్టి సారించవచ్చని హితవు పలికారు. మాక్లూర్ మండలం దాస్ నగర్ వద్ద గల మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను రోజు వారీగా తరలించేందుకు వీ లుగా స్వచ్ఛ ఆటోను పాఠశాలకు పంపా లని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు.

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. వివిధ విభాగాల వారీగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ, చక్కటి ఆరోగ్యం కోసం ఆకు కూరలు, తాజా కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా, వెంటనే నిర్వాహకుల దృష్టికి తీసుకురావాలని, అశ్రద్ధ చేయకూడదని అన్నారు. సరైన ఆహార నియమాలను పాటిస్తూ, తగినంత నిద్ర ఉండేలా చూసుకోవాలని, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని విద్యార్థినులకు మార్గ నిర్దేశం చేశారు. ఎలాంటి ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా, వార్షిక పరీక్షలను ఆత్మ విశ్వాసంతో రాయాలని సూచించారు. బాలికల భద్రత, రక్షణ, ఆరోగ్యాల పరిరక్షణ విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని, బయటి వ్యక్తులు ఎవరూ పాఠశాల లోనికి రాకుండా గట్టి పర్యవేక్షణ చేయాలని పాఠశాల నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎం హెచ్ఓ డాక్టర్ శ్వేత, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న, వైద్యులు సందీప్, శశిధర్, అరవింద్ తదితరులు ఉన్నారు.



# కొంపల్లిలో హివాగ లగ్జరీ బ్యూటీ క్లినిక్ ప్రారంభం

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

దేశంలో బిగ్గెస్ట్ లగ్జరీ బ్యూటీ క్లినిక్‌గా ప్రసిద్ధిగాంచిన "హివాగ" కొత్త బ్రాంచ్ శనివారం కొంపల్లిలో ఘనంగా ప్రారంభమైంది. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లో "హివాగ" ఫస్ట్ బ్రాంచ్ గచ్చిబౌలిలో ఏర్పాటు చేశారు. ఇప్పుడు కొంపల్లిలో రెండో బ్రాంచ్ ప్రారంభించారు. దేశవ్యాప్తంగా "హివాగ"కు ఇది 8వ బ్రాంచ్ కావడం విశేషం. ఈ క్లినిక్ కు హరిత రెడ్డి సతి సీఈఓగా, రామ్ మోహన్ రెడ్డి సతి మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ క్లినిక్ లో నిపుణులైన డెర్మటాలజిస్టుల ఆధ్వర్యంలో మెన్, వుమన్ కు ట్రీట్‌మెంట్స్ అందుబాటులో ఉంటాయి. ఈ సందర్భంగా సీఈఓ హరితరెడ్డి సతి మాట్లాడుతూ.. హైదరాబాద్ లో మూడేళ్ల క్రితం ఫస్ట్ బ్రాంచ్‌ను గచ్చిబౌలిలో స్టార్ట్ చేశాం. ఇప్పుడు సెకండ్ బ్రాంచ్‌ను కొంపల్లిలో ప్రారంభించుకోవడం సంతోషం తోపాటు మరింత బాధ్యత పెరిగిందన్నారు. మొత్తంగా ఇది తమ క్లినిక్‌కు 8వ బ్రాంచ్. "హివాగ" లగ్జరీ బ్యూటీ క్లినిక్ లో అన్ని రకాల స్కిన్, హెయిర్ ట్రీట్ మెంట్స్ ఆడ, మగవారికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నిపుణులైన డెర్మటాలజిస్టుల ఆధ్వర్యంలో చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు.

# అల్లాహ్ దీవెనలతో ప్రజలకు, ప్రపంచ మానవాళికి సకల శుభాలు కలగాలి

చౌటుప్పల్ ఈద్గా చైర్మన్,
మాజీ కౌన్సిలర్ బాబా షరీఫ్

**గోల్కొండ టైమ్స్, చౌటుప్పల్ :**



అల్లాహ్ దీవెనలతో ప్రజలకు, ప్రపంచ మానవాళికి సకల శుభాలు కలగాలని చౌటుప్పల్ ఈద్గా చైర్మన్, మాజీ చౌటుప్పల్ మున్సిపల్ కౌన్సిలర్ ఎండి బాబా షరీఫ్ అన్నారు. శనివారం రంజాన్ పర్వదినం పురస్కరించుకొని చౌటుప్పల్ మండల కేంద్రంలోని ఈద్గా వద్ద చైర్మన్ బాబా షరీఫ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఈద్గా చైర్మన్ బాబా షరీఫ్ మాట్లాడుతూ.. నెలరోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే రంజాన్ పండుగను ముస్లిం సోదరులు తమ కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈద్–ఉల్–ఫితర్ సందర్భంగా ముస్లిం సోదరులు అల్లా దీవెనలు నిండుగా అందుకోవాలని ఆకాంక్షించారు. అల్లాహ్ దీవెనలతో ప్రజలకు, ప్రపంచ మానవాళికి సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసం సందర్భంగా నెలరోజుల కఠిన ఉపవాస దీక్షతో క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన,దాతృత్వం, ప్రేమ,దయ,సోదర భావం ఐక్యతను పెంపొందిస్తాయి అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలు, విద్య, వైద్యం పట్ల మొండి చెయ్యి

## తెలంగాణ బడ్జెట్‌పై ఐద్వా ఆగ్రహం

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్ మరో సారి పాలకుల అమలు తీరు నిర్లక్ష్య వైఖరి. ఎన్నికల ముందు మహిళల అభివృద్ధే మా ధ్యేయం , మహిళా సాధికారతే మా ధ్యేయం అంటూ మహాలక్ష్మి పథకం ఉచిత సేవలు అంటూ గొప్పలు చెప్పిన ప్రభుత్వం, బడ్జెట్‌లో మాత్రం మహిళలకు, విద్య, వైద్యం రంగాలపై మొండి చెయ్యి చూపింది. ఇది హామీలకు పూర్తి వ్యతిరేకం, మహిళల పట్ల స్పష్టమైన నిర్లక్ష్యం అని ఐద్వా రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. మొత్తం సుమారు ₹3,24,234వేల లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించినది కేవలం ₹26 వేల కోట్ల పరిధిలోనే ఉండటం గమనార్హం. అంటే మొత్తం బడ్జెట్‌లో 8.22 శాతం. యునెస్కో సూచించిన 15–20 శాతం కేటాయింపులతో పోలిస్తే ఇది సగానికి కూడా చేరని దుస్థితి. ఇదే సమయంలో ఆరోగ్య రంగానికి కేటాయింపు ₹12–13 వేల కోట్ల మధ్యే ఉండటం, మొత్తం బడ్జెట్‌లో 5 శాతానికి కూడా తక్కువగా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జాతీయ ఆరోగ్య విధానం సూచించిన కనీస 8 శాతం లక్ష్యాన్ని కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. మహిళల ఆర్థిక భద్రతకు అడ్డుగోడగా ప్రచారం చేసిన మహాలక్ష్మి పథకం విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 6040. కోట్ల రూపాయలు అవసరమయ్యే ఈ పథకానికి బడ్జెట్‌లో కేవలం 4305 కోట్లు కేటాయింపు చేసి,సరిపడ నిధులు కేటాయించకుండా మాటలకే పరిమితం చేసింది.

### వడ్డిలకే 2 వేల కోట్లు

రాష్ట్రంలో సన్నబియ్యం పథకానికి 3 వేల కోట్లు కేటాయించగా వాటిలో వడ్డిలకే 2 వేల కోట్లు పోతాయ ని ఒక్క వెయ్యి కోట్లతో సన్నబియ్యం ఎలా అందరికీ అందిస్తారని ఐద్వా ప్రశ్నిస్తుంది. గత బడ్జెట్‌లతో పోలిస్తే మహిళా మరియు శిశు సంక్షేమ శాఖకు కేటాయించిన నిధులు సరిపోవని, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడంలో ఈ బడ్జెట్ విఫలమైంది. ఎన్నికల మేనిఫెస్టోలో మహిళా సంఘాలకు ₹10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం ₹5 లక్షల లోపు రుణాలకే పరిమితం చేయడం ఎంటని ప్రశ్నించారు. నెలకు ₹2,500 సాయం (మహాలక్ష్మి పథకం కింద) ఎన్నికల హామీ ప్రకారం ప్రతి మహిళకు నెలకు ₹2,500 ఆర్థిక సాయం అందిం చే పథకానికి బడ్జెట్‌లో స్పష్టమైన కేటాయింపులు లేవు. ఆశా వర్కర్లు మరియు అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాల పెంపు లేదా ఇతర ప్రయోజనాలపై బడ్జెట్‌లో ఎటువంటి సానుకూల ప్రకటన లేదు.

రాష్ట్రంలో మహిళల పరిస్థితి ఇప్పటికే ఆందోళనకరంగా ఉంది. ఎన్‌సిఆర్‌బి గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో మహిళలపై నేరాలు నమోదవుతున్నాయి. పీఎల్ఎఫ్ఎస్ గణాంకాల ప్రకారం మహిళల శ్రమలో పాల్గొనడం 20–25 శాతం మధ్యే ఉండటం వారి ఆర్థిక స్థితిని స్పష్టం చేస్తోంది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5 ప్రకారం గర్భిణీ స్త్రీలలో 50 శాతం పైగా రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మహిళల కోసం ప్రత్యేక కేటాయింపులు పెరగాల్సింది పోయి తగ్గడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. విద్యారంగంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, హాస్టళ్లలో మౌలిక సదుపాయాల లోపం, బాలికల భద్రతా సమస్యలు పెరుగుతున్నాయి. ఉన్నత విద్యలో ఫీజుల భారంతో పేద కుటుంబాల అమ్మాయిలు చదువు మధ్యలోనే వదిలి పెట్టే పరిస్థితి ఏర్పడుతోంది. వైద్య రంగంలో కూడా ఇదే పరిస్థితి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, నర్సులు లేకపోవడం, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో సదుపాయాల లేమి, ఉచిత ఔషధాల కొరత.,ఇవి పేద మహిళల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే బడ్జెట్ సవరించి ఈ అంశాలను పరిశీలన చేయాలని ఐద్వా డిమాండ్ చేస్తోంది. విద్యారంగానికి కనీసం 20 శాతం బడ్జెట్ కేటాయించాలి అని అన్నారు.ఆరోగ్య రంగానికి కనీసం 8 శాతం నిధులు కేటాయించాలి; మహాలక్ష్మి పథకానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించి వెంటనే అమలు చేయాలి; మహిళల భద్రతకు ప్రత్యేక నిధులు ఏర్పాటు చేయాలి; స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక మద్దతు పెంచాలి. మహిళల పేరుతో ప్రచారం చేసి, బడ్జెట్‌లో మాత్రం నిర్లక్ష్యం చూపడం ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఐద్వా రాష్ట్ర కమిటీ హెచ్చరిస్తోంది.

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

## చౌటుప్పల్ మున్సిపాలిటీ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

**గోల్కొండ టైమ్స్, చౌటుప్పల్**



చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో రంజాన్ పండుగ వేడుకలు శనివారం మిన్నంటాయి. ముస్లిం సోదరులు ఉదయాన్నే స్థానిక ఈద్గా వద్దకు చేరుకుని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.మత సామరస్యాన్ని పెంపొందించి ఐక్యతను చాటే పర్వదినం పవిత్ర రంజాన్ అని,రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ చౌటుప్పల్ మున్సిపాలిటీ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ గారు,చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య గారు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి అల్లాహ్కు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలందరూ సుఖ సంతోషాలతో జీవించేలా ఆ అల్లాహ్ అనుగ్రహించాలని ఆకాంక్షించారు, ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు. కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్,కౌన్సిలర్లు, కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, బద్రి గాలయ్య, చింతల ఉమామహేశ్వరి సాయిలు ,పిల్లలమరి మధుసూదన్, ఎండి హను బాయ్, ఏఎంసీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ బాబా షరీఫ్, ఎండి కరీం,పెద్దగొని రమేష్ గౌడ్, ఎండి ఎజాస్,వహీద్, గణేష్, చింటూ, సంతోష్, శివ, అజయ్, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.




# విదేశీ విద్యాలయాలను ఆహ్వానించడం కాదు ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై దృష్టి సారించాలి

## టీఎస్ యూటీఎఫ్ డిమాండ్

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్**

కొద్ది మంది ధనవంతుల కోసం విదేశీ విద్యాలయాలను ఆహ్వానించడం కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వ పాఠశాలల బలోపేతం దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర ఆఫీసు బేరర్స్ సమావేశం శనివారం టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో చావ రవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రవి మాట్లాడుతూ రాష్ట్రంలో యుకె పాఠశాలల ఏర్పాటు కోసం ఆయా యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చర్చలు జరిపి ఆహ్వానించడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ పాఠశాలలను ఆహ్వానిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యతను విస్మరించి, కొందరికే నాణ్యమైన విద్యను పరిమితం చేయాలనే ఆలోచన సరికాదన్నారు. గత ప్రభుత్వం కొన్ని వందల గురుకులాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలను గాలికొదిలేసింది. ఈ ప్రభుత్వం కూడా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అనే ఆకర్షణీయమైన పేర్లతో ప్రభుత్వ రంగంలో నాణ్యమైన విద్యను కొందరికే పరిమితం చేస్తోంది. బడ్జెట్ కేటాయింపులు కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటే ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, కెజి తరగతులు ప్రారంభించాలని, పర్యవేక్షణ అధికారుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని, జిఒ 25 ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, 50 మంది విద్యార్థులు మించిన పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ మాట్లాడుతూ పిఆర్సీ రిపోర్టు విడుదల చేసి 1.07.2023 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డిఎలు, పెండింగ్ బిల్లుల మంజూరు, వివిధ యాజమాన్యాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి జెఎసి ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధం కావాలని లేని పక్షంలో టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్వతంత్ర పోరాటం చేస్తామని ప్రకటించారు. మార్చి 29న జోగులాంబ జిల్లా గద్వాల జిల్లా ఆలంపూర్ లో జరిగే టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశంలో కార్యాచరణను నిర్ణయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని, రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి లక్ష్మారెడ్డి, కార్యదర్శులు సత్యానంద్, రాజు, రంజిత్ కుమార్, రవిప్రసాద్ గౌడ్, మల్లారెడ్డి, రవి కుమార్, శ్రీధర్, సింహాచలం, జ్ఞానమంజరి, వెంకటప్ప, వెంకటేశం, సోమయ్య, విశాలి, యాకయ్య, కొండలరావు పాల్గొన్నారు.

# మొన్న భార్య.. నేడు ఎస్ఐ ఆత్మహత్య

## భార్య మృతితో మనస్తాపం చెంది ఉరేసుకొని బలవన్మరణం

**గోల్కొండ టైమ్స్, కరీంనగర్ ;**



కరీంనగర్ రెండవ ఠాణా ఎస్ ఐ చంద్రశేఖర్ ఉరి వేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. గత ఐదు రోజుల క్రితం చంద్రశేఖర్ భార్య దివ్య గన్నేరు పప్పు తిని ఆత్మహత్య చేసుకోగా కడుపు నొప్పి తో ఆత్మహత్య చేసుకుందనీ పోలీసులకు భర్త ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో దివ్య మృతదేహాన్ని స్వగ్రామం ఇల్లందకుంట మండలం సీతంపేట కు తరలించగా సీతంపేట గ్రామంలో దివ్య ఆత్మహత్యకు భర్త చంద్రశేఖర్ కారణమని మృతురాలి బంధువులు దాడికి ప్రయత్నించారు. దీంతో గ్రామస్తులు, బంధువుల నిరసనల మధ్య మృతురాలి తల్లిదండ్రులు అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా శనివారం ఐదు రోజుల కార్యక్రమానికి అత్తగారింటికి వచ్చిన ఎస్సై చంద్రశేఖర్ అత్తగారింట్లోనే ఉరి వేసుకొని బలవర్మరణానికి పాల్పడ్డాడు. గదిలో నుండి బయటికి రాకపోవడం తో అనుమానం తో చూడగా ఉరి వేసుకొని ఉండడం తో జమ్మికుంట లోనీ ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారణ చేశారు. చంద్రశేఖర్ మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎస్సై చంద్రశేఖర్, అతని భార్య దివ్య మరణంతో ఈ సంఘటన జిల్లాలో హృదయ విదార కత నెలకొంది. వీరికి కలిగిన సంతానం అనాధలుగా మిగిలిపోవాల్సి వచ్చింది.



# బోడుప్పల్‌లో రంజాన్ వేడుకలు

## ఆలంగిర్ మజీద్‌లో ఆధ్యాత్మిక వాతావరణం

**గోల్కొండ టైమ్స్ మేడ్చల్**

మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌లోని ఆలంగిర్ మజీద్ (కుతుబ్ షాహీ మజీద్)లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నా పెద్దా తేడా లేకుండా ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉపవాస దీక్షలు విరమించుకొని ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా సిద్ధం చేసిన షీర్ కుర్మా పాయసం అందిపుచ్చుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. మజీద్ అధ్యక్షుడు పఠాన్ ఇస్మాయిల్ మాట్లాడుతూ బోడుప్పల్ ప్రజలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జీవించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు కోసం రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. అదేవిధంగా పేద ముస్లిం కుటుంబాలకు రూ.2,500 విలువైన రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. మజీద్‌కు కేటాయించిన గ్రేవ్‌యార్డ్ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.16 లక్షలు మంజూరు చేసి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తోటకూర వజ్రేష్ యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




# రంజాన్ సందేశం – మత సామరస్యానికి ప్రతీక

జక్క వెంకట్ రెడ్డి

**గోల్కొండ టైమ్స్ మేడ్చల్**

మేడ్చల్ జిల్లా మేడిపల్లిలో రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంజాన్ పర్వదినం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మైనారిటీ నాయకులు జావీద్ ఖాన్, జిలాని పాషా ఆధ్వర్యంలో పలువురు ముస్లిం సోదరులు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జక్క వెంకట్ రెడ్డిను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మాజీ కో–ఆప్షన్ సభ్యురాలు నాజియా జావీద్ ఖాన్ నివాసంలో జరిగిన రంజాన్ వేడుకల్లో జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తూ క్రమశిక్షణతో ప్రార్థనలు నిర్వహిస్తారని తెలిపారు. కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం రంజాన్ ప్రత్యేకత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జమీల్, జహంగీర్, జాఫర్, అలీమ్, పాషా, ఇర్ఫాన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

# రేపు అమరవీరుల దినోత్సవాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటించండి

## యస్ కె యం పిలుపు

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**

భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు అమరవీరుల దినోత్సవమైన మార్చి 23ని తెలంగాణ రాష్ట్రం అంతటా సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటించాలని సంయుక్త కిసాన్ మోర్చా రైతులకు పిలుపునిచ్చింది. ఆయా జిల్లాల్లో సామూహిక నిరసన కార్యక్రమాలు కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించాలని కోరారు. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపాలని, అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని, 4 కార్మిక చట్టాలను, ఇతర కార్పొరేట్ అనుకూల చట్టాలు, విధానాలను తిరస్కరించాలని డిమాండ్ చేస్తూ సామ్రాజ్యవాద వ్యతిరేక దినోత్సవాన్ని పాటిస్తారు. ఇరాన్‌పై యుద్ధం అనైతికమైనది, చట్టవిరుద్ధమైనది. డోనాల్డ్ ట్రంప్, బెంజమిన్ నెతన్యాహులను యుద్ధ నేరస్థులుగా ప్రకటించి, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించినందుకు, సార్వభౌమ దేశమైన ఇరాన్‌పై దాడి చేసినందుకు వారిపై విచారణ జరిగేలా చూడాలని ఎస్.కె.ఎం. కోరుతోంది.

బ్రిక్స్ కూటమికి భారతదేశం అధ్యక్షత వహిస్తున్నప్పటికీ, గాజా/పాలస్తీనా, వెనిజులా, ఇరాన్‌లలో జరుగుతున్న మారణహోమం వంటి పలు పరిణామాలపై మోదీ ప్రభుత్వం మౌనం వహించింది. అదే సమయంలో, మిగతా సభ్య దేశాలన్నీ ఈ సమస్యలన్నిటిపై అమెరికా–ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా గట్టి వైఖరిని తీసుకున్నాయి. ఈ అమెరికా అనుకూల సామ్రాజ్యవాద విధానం భారతదేశాన్ని ఇతర ప్రపంచ దేశాల మధ్య ఏకాకిని చేసింది. రైతులు, కార్మికులు, దేశీయ పరిశ్రమల కీలక ప్రయోజనాలను ప్రభావితం చేసే అసమాన వాణిజ్య ఒప్పందాన్ని అమెరికాతో మోదీ ప్రభుత్వం అంగీకరించడంలో, జాతీయ సార్వభౌమత్వం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి పరిమితం కావడానికి సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో, అమెరికా అనుకూల విధానానికి, అమెరికా వాణిజ్య ఒప్పందంపై ట్రంప్ బెదిరింపు వ్యూహాలకు గురైన భారత ప్రజల ప్రయోజనాలను వదులుకోవడానికి మధ్య ఉన్న సంబంధాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు.

అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ ప్రభుత్వం లొంగిపోవడానికి, ఇరాన్‌పై యుద్ధానికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాద వ్యతిరేక దినోత్సవాన్ని పాటించేందుకు భారతదేశవ్యాప్తంగా ఉన్న రైతులందరూ ర్యాలీ చేయాలని ఎస్.కె.ఎం. పిలుపునిచ్చింది.

# రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

**గోల్కొండ టైమ్స్, మర్రికల్ :**



రోడ్డు ప్రమాదంలో యువకుడు రిషి వర్ధన్ రెడ్డి (12 ) తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నారాయణ పేట్ జిల్లా మర్రికల్ మండల కేంద్రంలోని శనివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఉదయాన్నే సైకిల్ మోటార్ ను కారు ఢీకొనడంతో తలకు బలమైన గాయాలు తగలడంతో వెంటనే హైదరాబాద్ లోని ఓ హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

Publish, printed & Owned by GOLCONDA TIMES MEDIA NETWORK, Survey of INDIA, Uppal, Hyderabad -500039, Cont: +919542605665, +918977912565, mail us: golcondatimes99@gmail.com, E-mail: admin@golcondatimes.com.